RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:83 | మార్చి 11, 2026 | వెల: రూ.3-00

# గ్యాస్ మంటలు!




## దేశవ్యాప్తంగా వాణిజ్య సిలిండర్ల కొరత

- ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో సంక్షోభం
- విలవిలలాడుతున్న హోటల్ రంగం
- ముంబైలో 20 శాతం హోటళ్లు మూత..
- పలు మెట్రో నగరాల్లోనూ భారీ కొరత
- ఉన్న గ్యాస్ నిల్వలను బ్లాక్ చేస్తున్న అక్రమార్కులు
- బ్లాక్ మార్కెట్ దందాపై కేంద్రం ఉక్కుపాదం
- దిగుమతులపై అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం

2లో

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య రాజుకున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు భారతీయ వంటగదుల్లో మంటలు పుట్టిస్తున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలతో అంతర్జాతీయ సరఫరా దెబ్బతినడంతో, దేశవ్యాప్తంగా వాణిజ్య సిలిండర్ల కొరత తీవ్రమైంది. ముఖ్యంగా దేశ ఆర్థిక రాజధాని ముంబైలో గ్యాస్ అందక ఇప్పటికే 20 శాతం హోటళ్లు బోర్డులు తిప్పేయగా, మరో రెండు రోజుల్లో సగం హోటళ్లు మూతపడే ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని కేంద్రం భరోసా ఇస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం బ్లాక్ మార్కెట్ దందా నిరాటంకంగా సాగుతోంది. అదును చూసి అక్రమార్కులు రెట్టింపు ధరలకు సిలిండర్లు విక్రయిస్తుంటే, హోటల్ యజమానులు దిక్కుతోచని స్థితిలో విలవిలలాడుతున్నారు. హార్మూజ్ జలసంధిలో రవాణా అడ్డంకులు ఏర్పడడంతో గ్యాస్ ధరలు పెరుగుతున్నాయి.. ఫలితంగా హోటల్ రంగం చితికిపోతున్నది



## రూ.1.7 లక్షలకు బిడ్డను అమ్మేశారు!

- డబ్బుల కోసం పేగు బంధాన్ని అమ్ముకున్న గిరిజన దంపతులు
- వారం రోజుల మగ శిశువు కామారెడ్డి దంపతులకు విక్రయం
- అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలి అప్రమత్తతతో బయటపడిన ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు

2లో

### రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి

## పేదల పట్ల కనికరం లేదు

### భూదాన్ భూములు అంటే పేదలకు ఇచ్చే భూములు

- వెలుగుమట్లలో పేదల ఇళ్లు కూల్చడం బాధాకారం
- నిరాహార దీక్ష నుంచి అర్ధరాత్రి అరెస్ట్ చేయడం దారుణం
- అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరిక
- పేదల ఇళ్ల కూల్చివేతపై కవిత ఫైర్

2లో



### అసెంబ్లీలో కాంగ్రెస్

## ప్రభుత్వాన్ని నిలదీస్తాం

- ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడుతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వర్క్‌షాప్
- పాల్గొన్న పార్టీ సీనియర్ నేతలు

2లో





### గోదావరి పుష్కరాలపై

## మంత్రుల రివ్యూ

- బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సర్క్యూట్ ప్రణాళిక
- పుష్కరాల ఏర్పాట్లపై మంత్రుల విస్తృత చర్చ
- భక్తులకు మెరుగైన సదుపాయాలపై అధికారులకు ఆదేశాలు

2లో



## మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు!

- ట్యాంక్‌బండ్‌పై గర్జించిన లక్షల గొంతుకలు
- తెలంగాణ ఉద్యమంలో కీలక ఘట్టం
- ఆనాటి రోజులను గుర్తుచేసుకున్న కేటీఆర్
- అమరవీరులకు నివాళులు

2లో

## రూ.1.7 లక్షలకు
# బిడ్డను అమ్మేశారు!

**వేద న్యూస్, మెదక్**

మెదక్ జిల్లాలో హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. డబ్బుల కోసం కన్నపేగు బంధాన్ని కాసులకు అమ్ముకున్న ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. పుట్టిన వారం రోజులకే తమ మగబిడ్డను విక్రయించి మానవత్వానికే మచ్చ తెచ్చిన ఘటన హవేలీఘనాపూర్ మండలం లింగసానిపల్లి తండాలో జరిగింది. ఈ సంఘటన బయటపడటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల ప్రకారం, లింగసానిపల్లి తండాకు చెందిన ఓ గిరిజన దంపతులకు గత నెల 10వ తేదీన మగబిడ్డ జన్మించాడు. అయితే ఆర్థిక ఇబ్బందులను కారణంగా చూపుతూ పుట్టిన వారం రోజులకే ఆ పసికందును కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ దంపతులకు విక్రయించినట్లు తెలిసింది. ఈ ఘటన అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలి అప్రమత్తతతో వెలుగులోకి వచ్చింది. బిడ్డ పుట్టిన తర్వాత తల్లి అంగన్‌వాడీ కేంద్రానికి గుడ్లు, ఇతర పోషకాహారం తీసుకోవడానికి రాకపోవడంతో ఉపాధ్యాయురాలికి అనుమానం కలిగింది. దీంతో ఆమె వారి ఇంటికి వెళ్లి చూడగా తలుపులకు తాళం వేసి ఉండటం గమనించారు. వెంటనే ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించడంతో వారు రంగంలోకి దిగారు. దర్యాప్తులో ఆ గిరిజన దంపతులు మరో గ్రామంలో ఉన్నట్లు గుర్తించారు. వారిని పట్టుకుని బిడ్డ గురించి ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. తమ మగబిడ్డను రూ.1.7 లక్షలకు కామారెడ్డి జిల్లాకు చెందిన దంపతులకు అమ్మేసినట్లు వారు ఒప్పుకున్నారు. దీంతో ఐసీడీఎస్ అధికారులు వారిని హవేలీఘనాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు!

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

స్వరాష్ట్ర సాధన కోసం ట్యాంక్‌బండ్‌పై యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై గర్జించి నేటికి 15 సంవత్సరాలు పూర్తయ్యాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో మిలియన్ మార్చ్ ఒక కీలక ఘట్టమని ఆయన పేర్కొన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం నాడు తెలంగాణ ప్రజల్లో ఏర్పడిన ఉద్యమ స్ఫూర్తి అపారమైందని తెలిపారు. 2011 మార్చి 10న నిర్వహించిన మిలియన్ మార్చ్ సందర్భంగా ఎన్నో నిర్బంధాలు, దిగ్బంధాలు, అడ్డంకులు ఉన్నప్పటికీ ఉద్యమకారుల సంకల్పాన్ని అవి దెబ్బతీయలేకపోయాయని కేటీఆర్ తెలిపారు. బ్యారికేడ్లు, ఇనుపకంచెలు ఏర్పాటు చేసినా తెలంగాణ కోసం పోరాడిన ప్రజల ఉత్సాహాన్ని ఆపలేకపోయాయని ఆయన అన్నారు. ఆ రోజు లక్షలాది మంది ట్యాంక్‌బండ్‌పై ఒకే స్వరంతో తెలంగాణ కోసం నినదించారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన పోరాట రూపాల్లో మిలియన్ మార్చ్ ఒకటని కేటీఆర్ పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, యువత, ప్రజా సంఘాల పాత్రను ఆయన ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజలు చూపిన ఐక్యత దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను ఈ సందర్భంగా కేటీఆర్ స్మరించారు. అమరవీరులకు జోహార్లు తెలుపుతూ జై తెలంగాణ అంటూ తన సందేశాన్ని ముగించారు. మిలియన్ మార్చ్ సందర్భంగా తీసిన పాత చిత్రాలను కూడా ఆయన సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి
# పేదల పట్ల కనికరం లేదు
### పేదల ఇళ్ల కూల్చివేతపై కవిత ఫైర్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. నిరాహార దీక్షకు దిగిన తనను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల కోసం గళమెత్తిన తనను ఉగ్రవాదిలా భావించి అరెస్ట్ చేయడం అన్యాయమని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత, వెలుగుమట్లలో పేదలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను అధికారులు కూల్చివేసిన తీరును తీవ్రంగా తప్పుబట్టారు. భూదాన్ భూములు అంటే పేదలకు ఇచ్చే భూములేనని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే ఇలాంటి చర్యలు చేపడుతోందని ఆమె విమర్శించారు. కూల్చివేసిన చోటే మళ్లీ ఇళ్లను నిర్మించి బాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ ఈ ఘటనపై స్పందించాలని కవిత సూచించారు. ఖమ్మం జిల్లాలో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న పరిస్థితిని ఆయన గమనించాలని కోరారు. ఈ అంశంపై ఆయనకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ చర్యల వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. బాధితుల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు కూడా ఉన్నారని కవిత తెలిపారు. పరీక్షల సమయంలో వారిని రోడ్డున పడేయడం కలెక్టర్, జిల్లా మంత్రులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని, అవసరమైతే కోర్టులో పిల్ దాఖలు చేసి న్యాయపోరాటం కూడా కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలు, కొనసాగిస్తున్న అన్యాయాలపై అసెంబ్లీలో గట్టిగా నిలదీయడానికి బీఆర్ఎస్ పార్టీ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు బండా ప్రకాష్, మధుసూదనాచారి, సబితా ఇంద్రా రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, హరీష్ రావు, రావుల చంద్రశేఖర్ రెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యులతో తమ అనుభవాలను పంచుకుంటూ అసెంబ్లీలో ఎలా సమర్థవంతంగా వ్యవహరించాలో సూచనలు చేశారు. ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలపై ఎలా స్పందించాల్సిన అంశాలపై నేతలు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మార్గనిర్దేశం చేశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ప్రశ్నించేందుకు పార్టీ సిద్ధంగా ఉందని కేటీఆర్ తెలిపారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ గట్టిగా పోరాడుతుందని ఆయన పేర్కొన్నారు.

# గ్యాస్ మంటలు!

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**




ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధం దేశవ్యాప్తంగా వంటగ్యాస్ సరఫరాలో ఏర్పడిన అంతరాయం ఇప్పుడు వాణిజ్య రంగాన్ని అతలాకుతలం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం వద్ద సరిపడా నిల్వలు ఉన్నాయని ప్రకటనలు వెలువడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం వాణిజ్య సిలిండర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ముఖ్యంగా దేశ ఆర్థిక రాజధాని ముంబైలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గ్యాస్ అందక వంటలు చేయలేని స్థితిలో ఇప్పటికే నగరంలోని 20 శాతం హోటళ్లు తమ బోర్డులు తిప్పేయగా, రాబోయే రెండు రోజుల్లో ఈ సంఖ్య 50 శాతానికి చేరుకునే ప్రమాదం ఉందని హోటల్ అండ్ రెస్టారెంట్ సంఘం హెచ్చరిస్తోంది.

### మెట్రో నగరాల్లో నిలిచిన సేవలు

ముంబై మాత్రమే కాకుండా ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వాణిజ్య సిలిండర్లు సకాలంలో సరఫరా కాకపోవడంతో చాలా రెస్టారెంట్లు తాత్కాలికంగా తమ సేవలను నిలిపివేశాయి. హోటల్ యజమానులు గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదు. దీనివల్ల వేల సంఖ్యలో కార్మికుల ఉపాధి దెబ్బతినడమే కాకుండా, బయట భోజనం చేసే సామాన్యులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

### అదును చూసి అక్రమార్కుల దోపిడీ

ఈ కొరతను ఆసరాగా చేసుకుని కొంతమంది మధ్యవర్తులు బ్లాక్ మార్కెట్ దందాను తెరపైకి తెచ్చారు. వాణిజ్య సిలిండర్లను సాధారణ ధర కంటే రెట్టింపు ధరలకు విక్రయిస్తూ అక్రమ లాభాలు గడిస్తున్నారు. అత్యవసరంగా గ్యాస్ కావాల్సిన వారు విధిలేని పరిస్థితుల్లో అధిక ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఈ అక్రమ విక్రయాలపై ఫిర్యాదులు అందడంతో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నిఘా పెంచింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచుతూ కొత్త నిబంధనలను తీసుకువచ్చింది.

### దిగుమతులపై పశ్చిమాసియా సెగ

భారతదేశం తన వార్షిక గ్యాస్ అవసరాల్లో సుమారు 62 శాతం దిగుమతుల ద్వారానే తీర్చుకుంటోంది. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఈ సంక్షోభానికి ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి మార్గంలో నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో దిగుమతులు నెమ్మదించాయి. అంతర్జాతీయ సరఫరా గొలుసులో తలెత్తిన ఈ లోపం నేరుగా భారతీయ హోటల్ పరిశ్రమను తాకింది.

### ప్రభుత్వ భరోసా - క్షేత్రస్థాయి వాస్తవాలు

చమురు మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ ప్రస్తుతం దేశంలోని గ్యాస్ నిల్వలను, సరఫరా వ్యవస్థను నిశితంగా పరిశీలిస్తోంది. ప్రభుత్వం వద్ద సరిపడా స్టాక్ ఉందని, కేవలం రవాణా పరమైన ఇబ్బందుల వల్లే కొరత కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. అయితే, బ్యాంక్ గ్యారెంటీలు, రవాణా అడ్డంకులు తొలగి, సిలిండర్లు నేరుగా వినియోగదారుడికి చేరేవరకు ఈ గ్యాస్ మంటలు చల్లారేలా కనిపించడం లేదు.

**దేశవ్యాప్తంగా వాణిజ్య సిలిండర్ల కొరత**

- ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో సంక్షోభం
- విలవిలలాడుతున్న హోటల్ రంగం
- ముంబైలో 20 శాతం హోటళ్లు మూత..
- పలు మెట్రో నగరాల్లోనూ భారీ కొరత
- ఉన్న గ్యాస్ నిల్వలను బ్లాక్ చేస్తున్న అక్రమార్కులు
- బ్లాక్ మార్కెట్ దందాపై కేంద్రం ఉక్కుపాదం
- దిగుమతులపై అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- రంజాన్ మాసం అంటేనే త్యాగం, సహనం, దాతృత్వం
- వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్
- కాజిపేట్ దర్గాలో ఇఫ్తార్ విందు



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

రంజాన్ మాసం త్యాగం, సహనం, దాతృత్వం, మానవతా విలువలకు ప్రతీక అని వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయూబ్ మహమ్మద్ అన్నారు. హన్మకొండ జిల్లా కాజీపేట్ దర్గాలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని కాజిపేట్ దర్గా పీఠాధిపతి, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ షా గులాం అఫ్జల్ బియాబాని కుశ్రో పాషా ఏర్పాటు చేసిన దావత్-ఎ-ఇఫ్తార్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపవాసం ద్వారా మనసును పవిత్రంగా ఉంచుకోవడం, అవసరమైన వారికి సహాయం చేయడం రంజాన్ మాసం ప్రధాన సందేశమని తెలిపారు. సమాజంలో శాంతి, సోదరభావం నెలకొని అన్ని మతాల ప్రజలు ఐక్యంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ దావత్-ఎ-ఇఫ్తార్ కార్యక్రమంలో అన్ని మతాలకు చెందిన మత పెద్దలు, ప్రజలు పాల్గొని సామరస్యానికి నిదర్శనంగా నిలిచారు. ప్రజా ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, దర్గా కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు .

# డంపింగ్ యార్డ్ తొలగించాలి
## మడికొండ గ్రామస్తుల రిలే నిరాహార దీక్ష

**వేద న్యూస్, మడికొండ**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణం మడికొండ-రాంపూర్ గ్రామాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ మడికొండ గ్రామస్తులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మడికొండ చౌరస్తాలో ప్రధాన రహదారిపై గ్రామస్తులు ఆందోళన చేపట్టి డంపింగ్ యార్డ్‌ను తరలించే వరకు దీక్ష కొనసాగిస్తామని హెచ్చరించారు. డంపింగ్ యార్డ్ కారణంగా గాలి, నీరు తీవ్రంగా కాలుష్యమై గ్రామ ప్రజలు శ్వాసకోశ సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నీటి కాలుష్యం వల్ల పంటలు పండక రైతులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డంపింగ్ యార్డును నివాస ప్రాంతాలకు దూరంగా తరలించి ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులను కోరారు. సమస్యపై అసెంబ్లీలో కాలింగ్ అటెన్షన్ మోషన్ ద్వారా చర్చించాలని, బయో-మైనింగ్ పనుల కోసం నిధులు మంజూరు చేసి పాత చెత్తను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ





కార్యక్రమంలో మడికొండ గ్రామానికి చెందిన అన్ని పార్టీల నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, మహిళలు, యువకులు, వృద్ధులు మరియు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలపై
# మంత్రుల సమావేశం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు ప్రారంభించింది. డా. బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన గోదావరి పుష్కరాల కేబినెట్ ఉపసమితి సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. గోదావరి పుష్కరాలను ఆధ్యాత్మిక వైభవంతో ఘనంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై వారు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రధాన దేవాలయాలను ఒక టెంపుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా గోదావరి తీరం వెంట ఉన్న పురాతన ఆలయాలను అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని మంత్రులు సూచించారు. ఆలయాల అభివృద్ధితో పాటు పర్యాటక అవకాశాలు పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. బాసర ఆలయానికి ఇప్పటికే మాస్టర్ ప్లాన్ ఆమోదం లభించిన నేపథ్యంలో భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి కూడా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. దీనిపై చర్చించి ముఖ్యమంత్రి ఆమోదం పొందాలని నిర్ణయించారు.

వేద న్యూస్

బుధవారం మార్చి 11, 2026

# సుందర మరిపెడకు బాటలు వేద్దాం

**- మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి**



**వేద న్యూస్, మరిపెడ :**

మరిపెడ పట్టణాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి కోరారు. మంగళవారం ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఎనిమిది, తొమ్మిదో వార్డులలో స్వచ్ఛత కార్యక్రమాలను మున్సిపల్ సిబ్బంది తో కలసి చేపట్టారు. మరిపెడ పట్టణ అభివృద్ధికి డోర్నకల్ ఎమ్మెల్యే కట్టుబడి ఉన్నారని, ఆయన ఆధ్వర్యంలో పట్టణాన్ని సుందరీ కరించుకుందామన్నారు. పుర ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు కాలనీల పారిశుద్యంలో చొరవ చూపాలన్నారు. ఈ సందర్బంగా వార్డు ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహనా కల్పించి, సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు మెరుగు రాము,జాటోతు సురేష్,గంట్ల గౌతమ్ రెడ్డి, రమేష్, నీలా లచ్చిరామ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ తాజుద్దీన్,మున్సిపల్ కమిషనర్ విజయానంద్,నాయకులు అలువాల ఉపేందర్ ప్రజాపతి, జానీ, సాయి, నాన్య,వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి మధ్యలోనే నీటి కటకట

**- ఎండల తీవ్రతతో ఎండిపోతున్న వరి పొలాలు**
**- అన్నదాత కళ్లల్లో కన్నీళ్లు**



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం బూరుగుపల్లి గ్రామంలో వేసవి ఎండలు ముదురుతుండడంతో రైతులకు సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. పంట చేతికొచ్చే సమయంలో నీరు అందక వరి పొలాలు కళ్లముందే ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పంటను కాపాడుకునేందుకు రైతులు బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేస్తున్నప్పటికీ భూగర్భ జలాలు కూడా తగ్గిపోవడంతో పరిస్థితి రోజురోజుకు విషమిస్తోంది. వర్షాకాలంలో సరైన వర్షాలు లేక చెరువులు, కుంటలు నిండకపోవడం వల్ల యాసంగి పంటలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నీటి కొరత కారణంగా పచ్చగా కళకళలాడాల్సిన వరి పొలాలు ఎండిపోతూ బీడువారుతున్నాయని, సాగునీరు అందక చేతికొచ్చే పంట కూడా పశువుల మేతగా మారే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ నీటి వనరులు కల్పించకపోతే రైతులు ఆర్థికంగా తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను నింపి సాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యేను రైతులు కోరుతున్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి..!



**వేద న్యూస్, నల్లబెల్లి :**

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన దుగ్గొండి మండలం తొగర్రాయి గ్రామ శివారులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే. నల్లబెల్లి మండలం దస్తగిరి పల్లి గ్రామానికి చెందిన పోతారాబోయిన మనోహర్ (25) తండ్రి చేరాలు ఒకే ఒక కుమారుడు సోమవారం రాత్రి కొమ్మల జాతరకు దర్శనానికి వెళ్లి అనంతరం తిరిగి నల్లబెల్లి, దస్తగిరిపల్లెకు స్వగ్రామానికి వస్తున్న క్రమంలో తొగర్రాయి గ్రామ శివారులో బైక్ పై వస్తున్న మనోహర్ అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్ ను గుద్దినట్టు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు వివరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. విషయం తల్లిదండ్రులకు తెలియజేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దస్తగిరి పల్లెలో యువకుడి మృతి సంఘటనా స్థానికంగా కలకలం సృష్టించాయి.

# 'క్లీన్ కోదురుపాక' ప్రారంభం



**వేద న్యూస్, బోయినిపల్లి:**

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న డీపీవో మొహమ్మద్ షార్ఫొద్దీన్**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోదురుపాక గ్రామంలో 99 డేస్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం క్లీన్ కోదురుపాకను మంగళవారం ప్రారంభించారు. రోడ్ నెంబర్18 వద్ద గ్రామ ప్రజలతో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పంచాయతీ అధికారి మొహమ్మద్ షార్ఫొద్దీన్, ఎంపీవో శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ డా. కత్తెరపాక మంజుల మాట్లాడుతూ గ్రామంలోని రహదారుల ఇరువైపుల డ్రైనేజీలను శుభ్రం చేయడంతో పాటు రోడ్డుపైకి వచ్చిన చెట్ల కొమ్మలను తొలగించే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. రహదారులపై ఉన్న కంకర, ఇసుక, మట్టి, మొరం, కట్టెలు తదితర సామగ్రిని అవసరమైతే తమ ఇళ్లలోపల ఉంచుకోవాలని, లేనిపక్షంలో గ్రామ సిబ్బంది వాటిని తొలగిస్తారని సూచించారు. వర్షాకాలంలో ఇలాంటి వస్తువుల వల్ల దోమలు పెరిగే అవకాశం ఉండటంతో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోపాల్, వార్డు సభ్యులు మైలారం శ్రీనివాస్, మెడికల్ భాస్కర్, పటాకులు శ్రీనివాస్, బాలాగోని సమత అనిల్, నాగుల వర్మ, నాగుల కళ్యాణి వంశీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మహిళా సమైక్య భవనాల నిర్మాణం చేపట్టాలి

**- సీపీఎం మండల కన్వీనర్ గురిజల శ్రీధర్**



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని గ్రామాల్లో మహిళా సంఘాలకు ప్రత్యేక భవనాలు నిర్మించాలని సీపీఎం మండల కన్వీనర్ గురిజల శ్రీధర్ డిమాండ్ చేశారు. గ్రామాల్లో మహిళలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, పొదుపు చిట్టీలు, బ్యాంకు రుణాలు తదితర అంశాలపై చర్చించుకోవడానికి మహిళా సమైక్య భవనాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా రత్నంపేటలో ఉన్న మహిళా సమైక్య భవనం పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించి కొత్త మహిళా సంఘ భవనాలు నిర్మించడంతో పాటు పాత భవనాలకు మరమ్మత్తులు చేపట్టి మహిళలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండలానికి చెందిన గుండేటి విజయ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, చేయూత వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన అసోసియేషన్ సభ్యులు రూ.5,500 నగదు సాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ వారి బాధలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ యువకుడు అకాల మరణం చెందడం బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. కుటుంబానికి కొంత ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చేయూత వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**- పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ దేదీప్య**



**వేద న్యూస్, బోయినిపల్లి:**

గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని విలాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ దేదీప్య కోరారు. రేపు ఉదయం 9 గంటలకు విలాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ శిబిరంలో స్త్రీరోగ నిపుణులు, చిన్నపిల్లల వైద్య నిపుణులు, కంటి వైద్యులు, దంత వైద్యులు, ఎముకల నిపుణులు, జనరల్ వైద్యులు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. మండల పరిధిలోని గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఆరోగ్య సమస్యలకు పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# వేములవాడలో బీఆర్ఎస్ పార్టీలో చేరికలు



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వేములవాడకు చెందిన నాగుల రాముగౌడ్ మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వేములవాడ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీ నరసింహారావు సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. గత కొన్నేళ్లుగా రాజకీయాల్లో చురుకుగా ఉన్న రాముగౌడ్ ఇటీవల 27వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అభివృద్ధి లక్ష్యంగానే బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గజానందరావు, నరాల దేవేందర్, మాజీ కౌన్సిలర్ గోలి మహేష్‌తో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, అనుచరులు పాల్గొన్నారు.

# చెత్త రహిత మంథనిగా తీర్చిదిద్దుతాం

**- మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్**



**వేద న్యూస్, మంథని:**

మంథని పట్టణాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మంథని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన పారిశుధ్య కార్యక్రమాలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికలో భాగంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి చెత్త తొలగింపు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో మంథని మున్సిపాలిటీని రాష్ట్రంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రత్యేకంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 13 వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలను పూర్తిగా శుభ్రపరచడంతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని, అన్ని వార్డుల్లో స్ట్రీట్ లైట్లను అప్‌డేట్ చేస్తామని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కుర్ర లింగయ్య, ఎల్లంకి వంశీ, స్థానిక వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్



## మాదక ద్రవ్యాల నివారణకు కృషి చేయాలి

- సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత
- మడికొండ చౌరస్తా నుంచి అవగాహన ర్యాలీ



**వేద న్యూస్, మడికొండ:**

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మడికొండ పోలీసుల ఆధ్వర్యంలో టీజీఎన్ఏబీ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా మడికొండ చౌరస్తా నుంచి ఆర్ఎన్ఆర్ గార్డెన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ, మున్సిపల్, విద్య, ఆరోగ్య, మహిళా శాఖల అధికారులు కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ దార కవిత మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసై తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ నిర్మూలన కోసం పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని, టీజీఎన్ఏబీ, ఈగల్ టీమ్, వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రగ్స్ కంట్రోల్ బృందాలను ఏర్పాటు చేసి గంజాయి సహా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మడికొండ పోలీసులు, వివిధ శాఖల అధికారులు, పాఠశాల విద్యార్థులు, గ్రామ ప్రజలు సుమారు 700 మంది పాల్గొన్నారు.

## మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా నరసయ్య



**వేద న్యూస్, ముస్తాబాద్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా గూడెం గ్రామానికి చెందిన బొప్ప నరసయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సమా వేశంలో సభ్యుల సమక్షంలో నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శిగా తోట ధర్మేందర్, ఉపాధ్యక్షులుగా కుక్కల దేవేందర్, మెంగని శ్రీనివాస్, కోశాధికారిగా ఆది లక్ష్మణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో మాజీ మండల అధ్యక్షుడు మెంగని రాజు, వివిధ గ్రామాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. అలాగే మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి మెంగని మనోహర్, రాష్ట్ర నాయకులు శీలం స్వామి, జిలేల్లా మల్లేశం, మాజీ ఎంపీటీసీ బొప్ప శ్రీధర్, చెక్కపల్లి రాజు, బండి ఎల్లం, కొండాపూర్ శ్రీనివాస్, బండి రాములు, మొర్రిపల్లి సర్పంచ్ మెంగని శ్రీనివాస్, శీలం సుధాకర్, వరాల లక్ష్మీనారాయణ, బొప్ప శంకర్, వరుస సత్యం, దబ్బేడా రాములు, వరి లక్ష్మణ్, బొప్ప విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రమైన గ్రామం ఆరోగ్యకరమైన సమాజమే ప్రభుత్వ లక్ష్యం



**వేద న్యూస్,కారేపల్లి :**

కారేపల్లి మండలంలో మంగళవారం ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎంపీడీవో పొన్నూరు శ్రీనివాసరావు, సర్పంచ్ ఇస్లావత్ రాజుతో కలిసి చెత్తను శుభ్రం చేశారు. గంటల పాటు వాడ వాడాలా కలియతిరిగిన ఎంపీడీవో గ్రామపంచాయతీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని పరిసరాల పరిశుభ్రత లో ప్రజలు భాగస్వాములు కావాలని గ్రామస్తులకు సూచించారు. ఈ 99 రోజులలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి పూర్తి చేయాలని సర్పంచ్ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని యూత్ భూక్య రవి, పండు, నాగేశ్వరరావు, పంచాయతీ సిబ్బందులు తదితరులు పాల్గొన్నారు.

## కుంగ్ ఫూ పోటీలలో మందమర్రి విద్యార్థుల ప్రతిభ

- ఎస్ఐ నరేష్ చేతుల మీదుగా బహుమతుల ప్రధానం



**వేద న్యూస్, మందమర్రి :**

ధర్మపురి పట్టణంలో ఆదివారం ఆర్గనైజర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ కరాటే పోటీలలో మందమర్రి పట్టణానికి చెందిన విద్యార్థులు పలు విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించి పలు అవార్డులు సాధించారని మాస్టర్ జెట్టి కృష్ణ, గ్రాండ్ మాస్టర్ హరికృష్ణ తెలిపారు. మంగళవారం మందమర్రి పట్టణ సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన పట్టణ ఎస్ ఐ నరేష్, చేతుల మీదగా బహుమతులను అందజేసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో రాణిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని, చిన్న వయసు నుండే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దిన మాస్టర్ జెట్టి కృష్ణ మాట్లాడుతూ కుంఫు కరాటే విద్య నేర్చుకోవడం వల్ల విద్యార్థులు, మానసికంగా, శారీరకంగా, ఆత్మస్థైర్యం కోల్పోకుండా మనోధైర్యంగా ఉంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి కుంఫు పోటీలలో తమ ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతి గెలుచుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన జెట్టి కృష్ణ ను విద్యార్థుల తల్లి దండ్రులు అభినందించారు.

## గౌడ కులానికి చెందిన నూతన ప్రజాప్రతినిధులకు సన్మానం



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని శ్రీమాతా అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో గౌడ కులానికి చెందిన నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండల గౌడ సంఘం అధ్యక్షుడు గజ్జల రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుకూరి గోవర్ధన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బుర్ర నారాయణ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ సమాజానికి చెందిన ప్రజాప్రతినిధులను సన్మానించడం ఆనందదాయకమని తెలిపారు. గౌడ సమాజం ఐక్యతతో ముందుకు సాగి రాజకీయ, సామాజిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని, యువత విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం నాయకులు, వివిధ గ్రామాల గౌడ కులస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు కూల్చివేతపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ జిల్లా నాయకులు డిమాండ్



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ పట్టణంలోని బోయవాడ 58వ డివిజన్‌కు చెందిన నిరుపేద మహిళ లైన్ మంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి ప్రహరీ గోడను మున్సిపల్ అధికారులు కూల్చివేసిన ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ నాయకులు కూల్చివేసిన ప్రహరీ గోడను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధుల అండదండలతో మున్సిపల్ అధికారులు ప్రహరీ గోడను కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్న మహిళకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా డీఆర్ఎఫ్ సిబ్బంది వచ్చి గోడను కూల్చివేయడం అన్యాయమన్నారు. నగరంలో పేదవారికి ఒక న్యాయం, ధనికులకు మరో న్యాయం జరుగుతోందని ఆరోపించారు. పేద కుటుంబం తమ స్థలాన్ని అమ్మకుండా ఇల్లు నిర్మించుకోవడమే కారణంగా ఈ చర్య జరిగిందని అనుమానం వ్యక్తం చేశారు. కూల్చివేసిన ప్రహరీ గోడను వెంటనే పునర్నిర్మించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేకపోతే పేదల పక్షాన ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బాధితురాలు లైన్ మంగా, లైన్ మల్లేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహానాయిక సావిత్రిబాయి పూలే

- పాస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డా. సంగని మల్లేశ్వర్



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

స్త్రీల విముక్తి కోసం అహర్నిశలు శ్రమించిన మహానాయిక, గొప్ప రచయిత్రి సావిత్రిబాయి పూలే అని పూలే ఆశయ సాధన సమితి (పాస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం ప్రాంగణంలో పూలే ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంగని మల్లేశ్వర్ సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. సమాజంలో అందరూ చదవాలి, సమానత్వంతో జీవించాలనే లక్ష్యంతో పోరాడిన సామాజిక విప్లవ మాతృమూర్తి సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు. స్త్రీల విద్యాభివృద్ధికి ఆమె చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. సావిత్రిబాయి పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి మహిళ విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు మెరుగు బాబు యాదవ్, ఆకా రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాం వీరయ్య, డాక్టర్ వంగాల సుధాకర్, జిల్లా కార్యదర్శి డాక్టర్ ఏ. సంపత్ కుమార్, విజయ్, మంద శ్యాం, గైని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యమే పరమావధిగా అధికారుల ముందడుగు



**వేద న్యూస్, కారేపల్లి:**

ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని చేరువ చేయాలనే సంకల్పంతో మండల కేంద్రమైన కారేపల్లిలో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్ ను మంగళవారం అట్టహాసంగా జరిగింది. స్థానిక అధికారుల చొరవ, వైద్య బృందం కృషి వెరసి ఈ శిబిరం వందలాది మందికి వరంగా మారింది. ఈ మెగా హెల్త్ క్యాంప్‌ను మండల రెవెన్యూ అధికారి ఎమ్మార్వో ఆనంతుల రమేష్,మరియు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ ) పొన్నూరు శ్రీనివాసరావు,చేతులమీదుగా ప్రారంభించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో సుమారు వందలాది మందికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న రోగులకు ప్రభుత్వం తరఫున ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరం విజయవంతం కావడంలో ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు కీలక పాత్ర పోషించారు. మారుమూల ప్రాంతాల నుండి ప్రజలను క్యాంప్‌కు తీసుకురావడంలో వారి కృషి అమోఘమన్నారు."ప్రభుత్వ లక్ష్యం ఆరోగ్యవంతమైన సమాజం. ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందాలనే ఉద్దేశంతోనే ఈ మెగా క్యాంప్ ఏర్పాటు చేశాం. ప్రజలు తమ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఆనంతుల రమేష్, పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి, ఆరోగ్య సూత్రాలను పాటించాలని పొన్నూరు శ్రీనివాసరావు, పేర్కొన్నారు.

**ప్రజల హర్షం**

మండల స్థాయి ఉన్నతాధికారులు స్వయంగా దగ్గరుండి శిబిరాన్ని పర్యవేక్షించడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్ స్థాయి వైద్య పరీక్షలు తమ గ్రామంలోనే అందడం పట్ల కారేపల్లి వాసులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## పశువులకు ఉచిత గాలికుంటు నివారణ వ్యాధి టీకాలు



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండలంలోని రాయకూర్ క్యాంప్ గ్రామంలో మంగళవారం పశు వైద్యాధికారి డాక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ శిబిరంలో 99 పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పర్చూరి పద్మ, పశువుల పెంపకం దారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టేషనరీ అందజేత



**వేద న్యూస్, పాపన్నపేట :**

పాపన్నపేట మండలం యూసుఫ్‌పేటకు చెందిన అడ్వకేట్ సాయిబాబా గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన పెన్నులు, పెన్సిల్లు, కవర్లు, ఎరేజర్లు, షార్ప్నర్లు, స్కేలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇటువంటి సహాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు అడ్వకేట్ సాయిబాబా గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళను హత్య చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

**వేద న్యూస్, పాపన్నపేట :**



ఓ మహిళను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసిన సంఘటన ఏడుపాయల వద్ద మంగళవారం చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం కొడుపాక గ్రామానికి చెందిన బ్యాగరి సులోచన(35) కొన్నేళ్ల క్రితం భర్త మృతి చెందడంతో అప్పటి నుంచి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది.మెదక్ లో కూలీ పనులకు వెళ్తూ జీవిస్తుంది.కాగా సోమవారం ఉదయం ఇంట్లో నుంచి కూలీ పనుల కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు.దీంతో ఇంటి వద్ద ఉన్న కుమారుడు రాజేష్ బంధువులకు సమాచారం అందించాడు.చుట్టూ పక్కల వెతికారు.ఆచూకీ లభించ లేదు.మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు ఏడుపాయల సమీపంలోని చెలిమకుంట వద్ద అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతదేహన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.మృతురాలి ముఖంపై కర్రతో దాడి చేసిన బలమైన గాయం ఉండడంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు.మృతురాలి సోదరుడు దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా నరసయ్య ఎన్నిక

**వేద న్యూస్, ముస్తాబాద్:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షులుగా గూడెం గ్రామానికి చెందిన బొప్ప నరసయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా తోట ధర్మేందర్, ఉపాధ్యక్షులుగా కుక్కల దేవేందర్, మెంగని శ్రీనివాస్, కోశాధికారిగా ఆది లక్ష్మణ్ను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాజీ మండల అధ్యక్షుడు మెంగని రాజుతో పాటు మండలంలోని వివిధ గ్రామాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి మెంగని మనోహర్, రాష్ట్ర నాయకులు శీలం స్వామి, జిలేల్లా మల్లేశం, మాజీ ఎంపీటీసీ బొప్ప శ్రీధర్, చెక్కపల్లి రాజు, బండి ఎల్లం, కొండాపూర్ శ్రీనివాస్, బండి రాములు, మొర్రెపల్లి సర్పంచ్ మెంగని శ్రీనివాస్, శీలం సుధాకర్, వరాల లక్ష్మీనారాయణ, బొప్ప శంకర్, వరుస సత్యం, దబ్బేడా రాములు, వరి లక్ష్మణ, బొప్ప విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

**వేద న్యూస్, కరీంనగర్:**



మహిళా విద్యకు మార్గదర్శకురాలైన సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలోని రెవెన్యూ క్లబ్ ఆవరణలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాన్ని పూల బీసీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గడప కోటేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కడారి ఐలన్న, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోసం అంజయ్య, మహమ్మద్, రిటైర్డ్ తహసీల్దార్ మల్లేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశంలో మహిళా సాధికారతకు చిహ్నమైన సావిత్రిబాయి పూలే విద్యా రంగానికి, సామాజిక న్యాయానికి చేసిన సేవలు విశేషమని పేర్కొన్నారు. ఆమెను విద్యామాతగా కీర్తించారని తెలిపారు. తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి కఠినమైన సామాజిక ఆంక్షలను ఎదిరిస్తూ భారతదేశంలో మహిళా విద్యకు పునాది వేసిందని అన్నారు. బాలికల కోసం దేశంలోనే మొట్టమొదటి పాఠశాలను ప్రారంభించి మహిళా విద్య కోసం ఉద్యమాన్ని ప్రారంభించారని, కుల, లింగ వివక్ష నిర్మూలనకు తన జీవితాన్ని అంకితం చేసిందని తెలిపారు. ఆమె రచనలు, కవితలు స్త్రీలు మరియు అట్టడుగు వర్గాల ప్రజలకు ప్రేరణగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, సదానందం, మీనయ్య, చంద్రశేఖర్, సత్యనారాయణరావు, నరసయ్య, నాగేశ్వరరావు, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ బస్ స్టాండ్‌ను పరిశుభ్రంగా ఉంచుకుందాం

## – బస్ స్టేషన్ మేనేజర్ లకవత్ హరి నాయక్

**వేద న్యూస్, హుస్నాబాద్:**



హుస్నాబాద్ బస్ స్టాండ్‌లో 99 రోజుల ప్రజాపాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. హుస్నాబాద్ డిపో మేనేజర్ వెంకన్న నాయక్ ఆదేశాల మేరకు బస్ స్టాండ్ పరిసరాల్లో చెత్తను తొలగించి, బాత్రూమ్‌లను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా బస్ స్టేషన్ మేనేజర్ లకవత్ హరి నాయక్ మాట్లాడుతూ.. ప్రయాణికులు బస్ స్టాండ్‌లో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని తెలిపారు. చెత్త వేయడానికి డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బస్ స్టాండ్‌లో స్వచ్ఛ హుస్నాబాద్ బస్ స్టేషన్ కార్యక్రమం కింద గార్డెన్‌ను క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచుతున్నామని తెలిపారు. మన ఇల్లు ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో, అలాగే బస్ స్టాండ్‌ను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# లింగన్నపేటలో మెగా వైద్య శిబిరం

**వేద న్యూస్, గంభీరావుపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల ంలోని లింగన్నపేట ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం లింగన్నపేట గ్రామంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లింగన్నపేట గ్రామ సర్పంచ్ పిట్ల ఎల్లయ్య, ఉపసర్పంచ్ అబ్బురవేణి నరసింహులు, వార్డు సభ్యులు హాజరయ్యారు. శిబిరంలో ఆర్థోపెడిక్, గైనకాలజీ, ఆప్టమాలజీ, పీడియాట్రిక్, డెంటల్, జనరల్ మెడిసిన్ తదితర విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని గ్రామ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 335 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. అదనపు చికిత్స అవసరమైన 126 మందిని జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగన్నపేట వైద్యాధికారి డాక్టర్ అభినయ్, ఎంఆర్వో మారుతిరెడ్డి, సిహెచ్ఓ రమేష్తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# హామీ నిలబెట్టుకున్న కేటీఆర్

## – సాయిల కిషన్ పిల్లల పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్

**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన సాయిల కిషన్ ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కిషన్‌కు ఇద్దరు పిల్లలు ఉండగా, వారి భవిష్యత్తు దృష్ట్యా ఒక్కొక్కరి పేరుపై రూ.1 లక్ష చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయిస్తానని కేటీఆర్ ప్రకటించారు. ఇచ్చిన హామీ మేరకు మంగళవారం బ్యాంకులో ఇద్దరు పిల్లల పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి, డిపాజిట్ పత్రాలను కిషన్ కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దుబ్బాక రజిత రమేష్, ఉపసర్పంచ్ మొగిలి కరుణాకర్, మాజీ ప్యాక్స్ చైర్మన్ కోడూరి భాస్కర్, నాయకులు బండి శ్రీనివాస్, పూసపెల్లి సరస్వతి, నర్రా సతీష్ రెడ్డి, అఫ్రోజ్, అబ్బాడి తిరుపతి రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గంజి వాగులో అక్రమ ఇసుక రవాణా

## – కేసు నమోదు చేసిన పోలీసులు

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్తంభంపల్లి గ్రామ శివారులోని గంజి వాగు నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్తంభంపల్లి గ్రామానికి చెందిన చంద్రగిరి భరత్ ట్రాక్టర్‌తో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు బోయినిపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు.

# జీవ ఎరువులు వాడి నేల ఆరోగ్యాన్ని కాపాడాలి

## – వ్యవసాయ అధికారులు

**వేద న్యూస్, శంకరపట్నం:**



శంకరపట్నం మండలంలోని మెట్టుపల్లి రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, దానికి ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్టె ఎరువులు, జీవ ఎరువులు ఉపయోగించాలని సూచించారు. తక్కువ ఖర్చుతో పంటల ఉత్పత్తిని పెంచుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు శాస్త్రవేత్తల ద్వారా శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు తిరుపతి, కీర్తన, గ్రామ సర్పంచ్ కుమారస్వామి, ఉపసర్పంచ్ సుభాష్ రెడ్డి, కవ్వ పద్మతో పాటు మొలంగూర్, మెట్టుపల్లి, లింగాపూర్ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ

**వేద న్యూస్, వీర్నపల్లి:**



వీర్నపల్లి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-1 కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణానికి మంగళవారం భూమి పూజ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా రూ.90 వేల వ్యయంతో చేపట్టనున్న ఈ పనులను స్థానిక సర్పంచ్ మల్లారపు జ్యోత్స్న కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు మరియు సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు గ్రామ పంచాయతీ కట్టుబడి ఉందని తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయితే పిల్లలకు పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఉపసర్పంచ్ జక్కుల నరేష్, వార్డు సభ్యులు భగవంతం, సురేష్, రోజా, నవనిత, లక్ష్మీనారాయణ, సంజీవ్, పద్మయ్య, పిట్ల లావణ్య, గోరె మియా, టీ.ఏ అనిత తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక రిచ్ లను పరిశీలించిన ఎమ్మార్వో



**వేద న్యూస్, పోతంగల్ :**

పోతంగల్ మండలానికి నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ రంజిత్ మంగళవారం మండలంలోని కారేగం, హంగర్గ, సుంకిని మంజీరా నదిలోని ఇసుక పాయింట్లను పరిశీలించారు. అక్రమంగా ఇసుక రవాణా చేయకూడదని, అక్రమంగా ఇసుక రవాణా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిర్ధవర్, జిపిఓ లు ఉన్నారు.

# ఘనంగా పోచమ్మ బోనాలు

**వేద న్యూస్, పాపన్నపేట :**



పాపన్నపేట మండల కేంద్రం లోని ముద్దాపూర్ గ్రామంలో పోచమ్మ బోనాలు మంగళ వారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రామంలో ప్రతి ఇంటి నుంచి బోనం తయారు చేసుకొని మహిళలు ఆలయానికి తరలి వెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు యువకులు, కేరింతలు మధ్య బోనాలు ఊరేగింపు నిర్వహించారు ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగరాజు, ఉప సర్పంచ్ ఏవన్ వార్డ్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మండలంలో శుద్ధిత నీటి ప్లాంట్ ఏర్పాటు

**వేద న్యూస్, మంథని:**



మంథని మండలంలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో శుద్ధిత నీటి ప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మండలంలోని పుట్టపాక, ఖానాపూర్, లద్నాపూర్ గ్రామాల్లో నీటి ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాస మేనేజర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడు తూ.. మొత్తం రోగాలలో సుమారు 80 శాతం నీటి ద్వారా వ్యాపిస్తాయని తెలిపారు. శుద్ధమైన తాగునీరు వినియోగించడం ద్వారా నీటి ద్వారా వచ్చే వ్యాధులను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శుద్ధమైన నీటిని తాగడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా కోసం సుమారు రూ.10 లక్షల వ్యయంతో శుద్ధిత నీటి ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్లాంట్ల ద్వారా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వచ్చి ఆరోగ్యానికి మేలు కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ కొత్త శ్రీనివాస్, లోడి కోఆర్డినేటర్ మల్లేశం, బాలవికాస ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ప్రసూన్ రెడ్డి, బాల మోహన్ రెడ్డి, ఫీల్డ్ కోఆర్డినేటర్ కిషన్, గ్రామ సర్పంచులు వనం రామచంద్రరావు, రాజా బాబు, సంగెం అరుణ గట్టయ్య, మహిళా సమైక్య ప్రతినిధి మాదాసి పద్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్ బుధవారం మార్చి 11, 2026

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



**వేద న్యూస్, పాపన్నపేట :**

ఆటో అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలై ఒకరు మృతి చెందిన సంఘటన పాపన్నపేట గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు...పాపన్నపేట గ్రామానికి చెందిన ఆరే కటికే మోహన్(53) ఏడుపాయల వద్ద మేకల కట్టింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు.మంగళవారం ఉదయం ఏడుపాయలకు వెళ్తున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు.ఏడుపాయలకు వెళ్లి ఆటోలో ఇంటికి తిరిగి వస్తుండగా పాపన్నపేట శివారులోని రాగానే ఇతను ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది.దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మోహన్ కు తీవ్రగాయాలయ్యాయి.స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతుడి భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలి

**వేద న్యూస్, పోతంగల్ :**



గర్భిణులు, బాలింతలు తప్పని సరిగా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్వాడి సూపర్ వైజర్లు వెంకట రమణ, కొమురవ్వ అన్నారు. మంగళవారం పోతంగల్ మండలంలోని చేతన్ నగర్ అంగన్వాడి కేంద్రంలో గర్భిణీలకు శ్రీమంతాలు, చిన్నారుల కు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాంతా బాయి సునీల్, ఉప సర్పంచ్ యాదవ్ రావు, అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

## – మారిశెట్టి విజయదుర్గ డిమాండ్



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కర్నాటి క్రిష్ణయ్య నగర్ లో పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మహిళా సమాఖ్య నాయకులు మారిశెట్టి విజయదుర్గ ఆధ్వర్యంలో మహిళలు రోడ్డు పై కట్టెల పోయి పై వంట చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మోడీ డౌన్ డౌన్, కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి నసించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మారిశెట్టి విజయదుర్గ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ బండ పై ఐదువందలు రూపాయలు సబ్సిడీ ఇస్తామని మొండి చేయి చూపింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల సిపిఐ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు బడుగు మాధవరావు, గుడిమెట్ల శ్రీనివాసరావు, ఎచ్చెర్ల గౌరి శంకర్,మహిళా నాయకులు బడుగు రాజేశ్వరి,ఈడేబోయిన వెంకటరమణ, ఊటుకూరి విజయ, కట్టేకోల ఉషా, మందాటి సింధు, భూక్యా భారతి, ఎచ్చెర్ల శారధ, దొడ్డా వెంకన్న, అంబటి సుప్రియ, గుగులోతు రోజా, ముత్తవరపు రమాదేవి తదితరులు పాల్గొని నిరసన తెలిపారు.

# ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అలారం, ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. ఎన్నికల సామాగ్రి భద్రత అత్యంత ముఖ్యమని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్, ఏ ఇ లలిత, ఎన్నికల డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బహుజన్ సమాజ్ పార్టి ప్రతినిధి ఎం. కిషోర్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి ఎల్. సతీష్ బాబు, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు, తదితరులు ఉన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో రైతుల సంక్షేమంకు పెద్దపీట

## – ఎమ్మెల్యే జిఎంఆర్

**వేద న్యూస్, దేవరకద్ర :**



ప్రజా ప్రభుత్వంలో రైతుల సంక్షేమం కు పెద్దపీట వేసిందని దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. మంగళ వారం దేవరకద్ర మండల పరిధిలోని జినుగురాళ గ్రామంలో 30 లక్షల నిధులతో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్మాణానికి దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ భూమి పూజ చేశారు. అనంతరం రైతులకు స్పింక్లర్లు హార్టికల్చర్ ఎక్విప్మెంట్స్ పంపిణి చేశారు. ఈ సంధర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పాలన చేస్తున్నది రైతు పక్షపాత ప్రభుత్వం అని, అన్నదాతలను అన్ని విధాలుగా ఆదుకుంటూ వారికి తగిన ప్రోత్సహం అందిస్తుందని తెలిపారు. రైతుల రుణ మాఫీ,రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,మద్దతు ధర,సన్న ధాన్యానికి 500 బోనస్ లాంటి ఎన్నో రైతు సంక్షేమ పథకాలతో రైతులకు అండగా నిరుస్తున్నది ప్రజా ప్రభుత్వం అన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగమ్మ సాయులు, ఎమ్మార్వో, ఎంపీడీవో, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజిరెడ్డి, రాఘవేందర్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలి

## – బానోత్ దుర్గాప్రసాద్ నాయక్



**వేద న్యూస్,కారేపల్లి:**

కారేపల్లి మండలం గుట్టు కింద గుంపు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కొండను కొందరు మట్టి మాఫియా వ్యక్తులు నిర్బంధం లేకుండా అక్రమంగా తవ్వుతూ ప్రకృతి సంపదను దోచుకుంటున్నారని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోత్ దుర్గాప్రసాద్ నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై మంగళవారం కారేపల్లి మండల తహసీల్దార్ ఆనంత్తుల రమేష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బానోత్ దుర్గాప్రసాద్ నాయక్ మాట్లాడుతూ ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే కొండను యంత్రాలతో తవ్వి ట్రక్కుల ద్వారా మట్టిని తరలిస్తూ అక్రమ వ్యాపారం సాగిస్తున్నారని మండిపడ్డారు. ఒక్కో ట్రక్కు మట్టిని సుమారు రూ.800 చొప్పున విక్రయిస్తూ ప్రకృతి సంపదను దోచుకుని కొందరు మట్టి మాఫియా వ్యక్తులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. గ్రామ ప్రజల భవిష్యత్తు, పర్యావరణం గురించి ఎలాంటి బాధ్యత లేకుండా కొండను క్రమంగా మాయం చేసేలా తవ్వకాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా కొనసాగితే కొండ పూర్తిగా దెబ్బతిని భవిష్యత్తులో కొండచరియలు విరిగిపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రకృతి సమతుల్యతకు భంగం కలిగించే ఈ అక్రమ తవ్వకాలు గ్రామ ప్రజలకు ముప్పుగా మారుతున్నాయని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణ చట్టం1986, మైన్స్ అండ్ మినరల్స్ చట్టం1957 మరియు తెలంగాణ వాల్టా చట్టాల ప్రకారం ఇవి స్పష్టమైన నేరమని గుర్తు చేశారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు స్పందించకపోవడం ఆశ్చర్యకరమని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న మట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రజలను సంఘటితం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బానోత్ నరేష్ నాయక్, నాగరాజు నాయక్, రవి తదితర పోరాట సమితి సభ్యులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పోలీసుల చేయూత

## – బియ్యం, నిత్యావసరాలు వితరణ

**వేద న్యూస్, చందుర్తి:**



చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన మంజుల శేఖర్-రజిత దంపతుల పూరి గుడిసె సోమవారం ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. ఈ ఘటనలో గుడిసెలో ఉన్న సామగ్రి పూర్తిగా కాలిపోవడంతో ఆ కుటుంబం నిరాశ్రయులైంది. ఈ విషయం మీడియా ద్వారా తెలుసుకున్న చందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాండ్ల వెంకటేశ్వర్లు, ఎస్ఐ జిల్లెల రమేష్ మంగళవారం సాయంత్రం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పోలీస్ అధికారులు బాధితులకు 25 కిలోల బియ్యం, వంట సామగ్రి, వంట పాత్రలు, దుప్పట్లు అందజేసి అండగా నిలిచారు. విధి నిర్వహణలో బిజీగా ఉండే పోలీసులు సేవా భావంతో ముందుకు రావడం పట్ల మండల ప్రజలు అభినందిస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గుడిసె దగ్ధమై ఇంట్లోని వస్తువులన్నీ బూడిదైనట్లు సమాచారం. పోలీసుల సేవా భావాన్ని చూసి ఆ నిరుపేద కుటుంబానికి సహాయం చేసేందుకు పలువురు ముందుకు వస్తున్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు కొన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాడైన విద్యుత్ వైర్లను వెంటనే మార్చుకోవాలని, పిల్లలు మాచిస్ లేదా అగ్ని సంబంధిత వస్తువులతో ఆడకుండా చూడాలని తెలిపారు. అలాగే గడ్డి గూళ్లు, చెత్త వంటి సులభంగా మంటలు పట్టే వస్తువులను ఇంటి సమీపంలో నిల్వ చేయవద్దని సూచించారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదం గమనించిన వెంటనే స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని, వేసవి కాలంలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు.

# విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

## – 250 మందికి సహాయం చేసిన చంద్రు ఫౌండేషన్

**వేద న్యూస్,కారేపల్లి:**



సింగరేణి మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు చంద్రు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షలకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. చంద్రు ఫౌండేషన్ స్థాపకులు భూక్య వీరన్న (ఉపాధ్యాయులు, సూర్యతండా ప్రాథమిక పాఠశాల) మంగళవారం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, కలాలు, పెన్సిళ్లు, కొలతపట్టీలు, గణిత పెట్టెలను అందజేశారు. సింగరేణి మండలంలోని కోమట్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సింగరేణి కస్తూర్బా బాలికల విద్యాలయం, గేటకారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పేరుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల, మూలపోచారం ఆదర్శ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఈ పరీక్షా సామగ్రిని అందించారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 250 మంది విద్యార్థులకు సహాయం చేసినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా భూక్య వీరన్న మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ధైర్యంగా ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి తమ ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో కూడా సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరుపల్లి గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, జాన్సీ సౌజన్య, జయరాజు, లక్ష్మి ఆనంద్ తదితర ఉపాధ్యాయులు, చంద్రు ఫౌండేషన్ సభ్యులు రవి, రమేష్, భానుశ్రీ, వినోద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగికి పే స్కేల్ వేతనాలు అమలు చేయాలి

## – సమగ్ర శిక్ష జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి చంద్రశేఖర్ గౌడ్

**వేద న్యూస్, దేవరకద్ర :**



ప్రతి ఉద్యోగికి పే స్కేల్ వేతనాలు చెల్లించాలని విద్యాశాఖ సమగ్ర శిక్ష జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ చంద్రశేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం దేవరకద్ర మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ముందు కేజీబీవీ సిబ్బంది నల్ల బ్యాడ్జి లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో 3 దశలో పోరాటంలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులకు పేస్కేల్ వేతనాలు చెల్లించడంతో పాటు గత సంవత్సరం 29 రోజుల సమ్మె కాలపు వేతనాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఇప్పటి ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి మీ సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారని, ఈ హామీలను నెరవేర్చాలని సమ్మె సమయంలో చేసిన డిమాండ్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరిష్కరిస్తారని హామీ ఇచ్చారని ఇచ్చిన హామీని ఇంత వరకు నెర వేర్చలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ ఉద్యోగులకు ఏ విధంగా అయితే హెల్త్ పాలసీ తీసుకురావడం జరిగిందో అదే విధానమైనటువంటి దానిని సమగ్ర శిక్ష ఉద్యోగులకు కూడా అమలు చేయాలని ఇన్సూరెన్స్ కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో నిర్వహించిన 29 రోజుల సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలు కూడా ఇప్పటివరకు చెల్లించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాధిక శారద అనురాధ యాదయ్య ఉదయ్ కుమార్ లక్ష్మమ్మ తదితరు పాల్గొన్నారు.

# కేయూలోని పలు విభాగాల్లో 'క్లీన్ అండ్ గ్రీన్'



**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కేయూలో నిర్వహిస్తున్న 10 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల, ఇంగ్లీష్ విభాగం మరియు ఇతర విభాగాలకు చెందిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టి విభాగ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల పనితీరు, నిర్వహణ పరిస్థితులను పరిశీలించారు. సిఎస్‌డీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సిఎస్ఈ, ఐటీ ల్యాబ్‌లలో శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించి ల్యాబ్ పరిసరాలను పరిశుభ్రంగా మార్చడంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పరిశుభ్రతపై అవగాహనతో పాటు సామాజిక బాధ్యతాభావాన్ని పెంపొందించే లక్ష్యంతో చర్యలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల చొరవను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

# ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనర్థాలు

- వాడితే జరిమానా తప్పదు..
- ఎంపీడీఓ రాజేశ్వరి



**వేద న్యూస్, రామడుగు:**

ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక రకాల రోగాలు వస్తున్న నేపథ్యంలో ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని రామడుగు ఎంపీడీఓ రాజేశ్వరి సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఐదవ రోజు మంగళవారం శానాగర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగించే వారిని గుర్తించి వారికి జరిమానాలు విధించాలని అధికారులకు సూచించారు. కళ్యాణ మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా స్టీల్ గ్లాసులు, కంచాలు అందుబాటులో ఉంచాలని, లేకపోతే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. మన పెద్దలు ప్లాస్టిక్ వినియోగించకపోవడం వల్లనే క్యాన్సర్ వంటి రోగాలు వారి దరిదాపుకు రాలేదని పేర్కొన్నారు. అదేవిధంగా రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేసే వారిపై సిబ్బంది కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి కాలంలో నీటి కొరత తీవ్రం అయ్యే అవకాశం ఉన్నందున అందరూ సమిష్టిగా పనిచేసి నీటి ఎద్దడిని నివారించాలని అన్నారు. రోడ్లపై, మురికి కాల్వల్లో చెత్త వేయకుండా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అలాగే వీధి కుక్కల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గునుకొండ శైలజ, పంచాయతీ కార్యదర్శి మదు, మాజీ సర్పంచ్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**వేద న్యూస్, శంకరపట్నం:**

శంకరపట్నం మండల కేంద్రంలోని లక్ష్మీప్రసన్న గార్డెన్‌లో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా శంకరపట్నం, మానకొండూర్, తిమ్మాపూర్ మండలాల బీజేపీ ముఖ్య కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ప్రపంచ దేశాలకు దిక్సూచిగా మారిందన్నారు. బీజేపీ ధర్మం, న్యాయం, క్రమశిక్షణకు ప్రతీకగా నిలిచిందని, పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా పలువురు వక్తలు బీజేపీ చరిత్రవికాసం, సైద్ధాంతిక భూమిక, కార్యపద్ధతి, కార్య విస్తరణ, బూత్ నిర్వహణ, మన్ కీ బాత్, అంత్యోదయ ద్వారా సంతృప్తత, సోషల్ మీడియా, ఎస్ఐఆర్ తదితర అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు మాడ వెంకట్ రెడ్డి, రంగు భాస్కరచారి, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, నాగేశ్వర్ రెడ్డి, గుర్రాల వెంకటరెడ్డి, అలివేలు సమ్మిరెడ్డి, నాంపెల్లి శ్రీనివాస్, దండు కొమురయ్య, బీజేపీ మండల అధ్యక్షులు ఎనుగుల అనిల్, కంది రాజిరెడ్డి, సుగుర్తి జగదీశ్వర చారితో పాటు పలు గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, రాష్ట్రజిల్లా నాయకులు, వివిధ మోర్చాల బాధ్యులు, శక్తికేంద్రం ఇన్‌చార్జులు, బూత్ స్థాయి అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం జలాలు విడుదల చేయాలి

- రుద్రంగి రైతుల డిమాండ్



**వేద న్యూస్, రుద్రంగి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో తీవ్ర నీటి ఎద్దడి కారణంగా పంటలు ఎండిపోతుండటంతో బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు మల్యాల లింగయ్య మాట్లాడుతూ.. తనకు ఉన్న రెండు ఎకరాల వరి పంట నీరు లేక ఎండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు నీటి కోసం ఎనిమిది బోర్లు వేసినా చెరువుల్లో నీరు లేకపోవడంతో భూగర్భజలాలు తగ్గిపోయి బోర్లు కూడా పడలేదని తెలిపారు. వెంటనే కాళేశ్వరం నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం రుద్రంగి పంప్‌హౌజ్ కాలువను పరిశీలించిన సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు నీటి కరువు మొదలైందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం జలాలతో నాగరం చెరువు, అచ్చయ్య కుంట, బతుకమ్మ కుంట, సురమ్మ చెరువులు వేసవిలో కూడా నిండిపోయేవని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఫిబ్రవరిలోనే నీళ్లు ఇస్తామని చెప్పినా మార్చి వచ్చినా అమలు కాలేదని, నీటి కొరతతో పాటు విద్యుత్ కోతలు కూడా పెరిగాయని అన్నారు. ప్రస్తుతం పొట్టదశలో ఉన్న వరి పంట నీరు లేక ఎండిపోతుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి కాళేశ్వరం జలాలను విడుదల చేయకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగం మహేష్, చేప్యాల గణేష్, ఉప్పులూటీ గణేష్, దయ్యాల నారాయణ, సింగరావు గంగారెడ్డి, ఇర్జం రాజేశం, గసికంటి కొండయ్య, కదాసు లక్ష్మణ్, అల్లూరి గంగారెడ్డి, గజే నరేశ్, నర్సయ్య, గంగాధర్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

# 1000 బీడీలకు రూ.400 ఇవ్వాలి




**వేద న్యూస్, చిన్న చింతకుంట :**

వెయ్యి బీడీలకు 400 రూపాయలు కూలి పెంచాలని బీడీ యాజమాన్యాలకు డిమాండ్ నోటీసు ఇవ్వాలి. పాత కూలి ఒప్పందం మార్చి 30 వరకే ముగుస్తుంది. కొత్త వేతనం ఏప్రిల్ నుంచి మొదల వుతు ంది కావున కార్మికులందరూ మార్చి 12వ తారీకు నాడు చిన్న చింతకుంటకు పోరు గర్జన విస్తృత సమావేశం నిర్వహించి బీడీ యాజమాన్యాలకు డిమాండ్ నోటీసువ్వాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ టియుసిఐ జిల్లా అధ్యక్షులు జె ఎన్ దేవదానం పిలుపునిచ్చారు. నిత్యవసర ధరలకు అనుగుణంగా కూలి పెంచుకోవాలని కార్మికులు అధిక సంఖ్యలో చిన్న చింతకుంటకు కదిలి రావాలని పిలుపునిచ్చారు. దానితోపాటు ఆకు నిర్మాణాలు తగ్గించాలని, ప్రావిడెంట్ ఫండ్ లో ఖాతాల్లో పేరు వయసు తప్పులను యాజమాన్యమే సరిచేసి కార్మికులకు రిటైర్మెంట్ డబ్బులు ఇప్పివ్వాలని, ఇది యజమానులదే బాధ్యతని హెచ్చరించారు. బీడీ కార్మికులకు అందరికీ జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 12వ తారీకు గురువారం చిన్నచింతకుంటకు ప్రభుత్వ హాస్పిటల్ గ్రౌండ్ కు వందలాది మంది కార్మికులు తరలి రాగలరని కోరుతూ ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏ కొండన్న,యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కోళ్ల వెంకటన్న, చిన్న చింతకుంట కార్మిక నాయకుడు గుండన్న పాల్గొన్నారు.

# నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన



**వేద న్యూస్,నాగర్ కర్నూల్ :**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం ఆధ్వర్యంలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) వంటి పలు జాతీయ వైద్య సంస్థల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది. ఇందులో దేశవ్యాప్తంగా 2551 ఖాళీలు ఉన్నాయి. మొదటి నెల నుంచే రూ.85,000కు పైగా జీతాన్ని పొందవచ్చు. నర్సింగ్ పోస్టులలో 80 శాతం మహిళలతో, 20 శాతం పురుషులను తీసుకుంటారు. ఈ పరీక్షలో ప్రిలిమ్స్, మెయిన్స్ ఉంటాయి. ఈ రెండింటిలో విజయం సాధించిన వారికి సర్టిఫికెట్లు పరిశీలించి, అభ్యర్థుల ప్రాధాన్యం ప్రకారం పోస్టులు ఇస్తారు.అర్హత: బీఎస్సీ నర్సింగ్ / పోస్టు బేసిక్ బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎంతో పాటు కనీసం 50 పడకల ఆసుపత్రిలో రెండేళ్ల పని అనుభవం ఉండాలి. వయసు : 30 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు కేటగిరీ ప్రకారం పది నుంచి పదిహేనేళ్లు సడలింపులు వర్తిస్తాయి. ఆన్‌లైన్ దరఖాస్తులు : మార్చి 16 సాయంత్రం 5 వరకు స్వీకరిస్తారు. దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.3000. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ రూ.2400. దివ్యాంగులకు ఉండదు. ఆన్‌లైన్ పరీక్ష తేదీలు: స్టేజ్-1: 11.04.2026, స్టేజ్-2: 30.04.26 కు ఉంటుంది.

# బీజేపీ ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు విడుదల



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మానువాడ గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు బండి అంజయ్య బెయిల్‌పై విడుదలై స్వగృహానికి చేరుకున్నారు. ఉపాధి నిమిత్తం గతంలో దుబాయ్‌కు వెళ్లిన బండి అంజయ్య ఇటీవల తన తండ్రి అనారోగ్యంతో మృతి చెందారని తెలుసుకొని స్వగ్రామానికి వచ్చారు. ఈ నేపథ్యంలో 2021లో అప్పటి బీఆర్ఎస్ పార్టీకి చెందిన కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు దిష్టిబొమ్మ దహనం ఘటనకు సంబంధించి నమోదైన కేసులో బోయినిపల్లి పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. తాజాగా ఆయన బెయిల్‌పై విడుదలై స్వగృహానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొనుకటి హరీష్ బండి అంజయ్యను పరామర్శించి అధైర్యపడకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్ట గోవర్ధన్, జనగం లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ మోతే ఎల్లారెడ్డి, బందెల వెంకటి, జనగం శ్రీను, ఎలగందుల వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు




**వేద న్యూస్, దేవరకద్ర :**

దేవరకద్ర మండలం లక్ష్మీ పల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా అధికారులుగా వ్యవరించి అందరిని అలరించారు. ఈ సందర్బంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. కలెక్టర్ గా శ్వేతా మహంతి, డిఈఓ గా సాయి వరుణ్ తేజ్, ఎంఈఓ తనుజశ్రీ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ యం గా బల్సు చందన లు పాఠశాలను సందర్శించి తనిఖీ చేయడం అందరిని ఆకట్టుకుంది. హెచ్ యంగా యం. నవ్య శ్రీ ఉపాధ్యాయులుగా తారక రాము, బాలకృష్ణ, అఖిల, అమూల్య, సౌమ్య,అర్చన, ఆశమ్మ, వైష్ణవి, కావ్య శ్రీ, ఇందు,లక్ష్మీ, సుప్రియ, జగదీశ్, గోపాల కృష్ణ లు ఉపాధ్యాయులుగా వ్యవరించారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కల్పన, ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్రశేఖర్, విజయ లక్ష్మి, నాగేశ్వర్ రెడ్డి, విద్యా వాలింటర్ వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దాడులు



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని సింగారం మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వారు వెంటనే రంగంలోకి దిగి మెరుపు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి వాటిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా వాగుల నుంచి ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

# మహిళా విద్యకై సావిత్రిబాయి పూలే పోరాటం అపూర్వం

- సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్




**వేద న్యూస్, వనపర్తి :**

సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే మహిళా బాలిక విద్య కోసం సాగించిన పోరాటం చరిత్రలో చిరస్మరణీయమని సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్ అన్నారు. మంగళవారం వనపర్తి సిపిఐ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగాచిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిమ్న వర్గాల మహిళలు బాలికల విద్యకు నిషేధం ఉన్న కాలంలో మహారాష్ట్ర పూణేలో భర్త జ్యోతిరావు పూలే సహకారంతో 26 బాలికా పాఠశాలలను నడిపి విద్యాదానం చేశారన్నారు. దీనికి వ్యతిరేకంగా అగ్రవర్ణాలు దాడి చేసినా, అవమానించిన ఎదుర్కొని మహిళా విద్య కోసం పోరాడిన ఆమె చరిత్ర చిరకాలం గుర్తుండిపోతుందన్నారు. భర్త వద్ద చదువుకొని దేశంలో తొలి మహిళా టీచర్ గా చరిత్రకెక్కినఆమె పోరాట స్ఫూర్తితో బాలిక మహిళా విద్య కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, దళిత కుల పోరాట సమితి జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్ శిరీష, సిపిఐ నేతలు లక్ష్మీనారాయణ, వంశీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# బోల్తా కొట్టిన ఇసుక ట్రాక్టర్..

- తృటిలో తప్పిన పెను ప్రమాదం



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని కంది కట్కూర్ శివారులో మంగళవారం ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో తృటిలో భారీ ప్రమాదం తప్పింది. అతివేగంగా వెళ్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపు తప్పి పడిపోవడంతో అందులో ఉన్న పలువురికి గాయాలైనట్లు సమాచారం. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. నివాస ప్రాంతాలు, మలుపుల వద్ద కూడా ఇసుక ట్రాక్టర్లు అధిక వేగంతో ప్రయాణించడం వల్ల పాదచారులు, ఇతర వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలు ఉల్లంఘిస్తూ అతివేగంతో వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

వేద న్యూస్

బుధవారం మార్చి 11, 2026

# గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా

**– గ్రీన్ ఛానల్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్**

**వేద న్యూస్, కమలాపూర్:**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం ఎదుట మంగళవారం గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ.. తమకు ప్రతినెల గ్రీన్ ఛానల్ ద్వారా జీతాలు చెల్లించాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా నిర్ణయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో గ్రామపంచాయతీ కార్మికుల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రతతో పాటు ప్రమాద బీమా కల్పించాలని, ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో అసెంబ్లీలో జరిగే బడ్జెట్ సమావేశాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మాట్ల భాస్కర్, కమలాపూర్ మండల అధ్యక్షుడు పురుషోత్తం, గౌరవ అధ్యక్షుడు ఇసంపెల్లి ఐలయ్యతో పాటు కార్మికులు ఒస్కుల రమేష్, గీత, స్వరూప, రమాదేవి, సునీత, కవిత, రమ, సుశీల, రాజు, సంతోష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**వేద న్యూస్, నెక్కొండ:**



నెక్కొండ మండలం వెంకటాపురం గంగదేవి తండాలో దుర్గమ్మ బోనాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు గ్రామ ప్రజలతో కలిసి బోనాల పండుగలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాస్, మాజీ ప్యాక్స్ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి, బొమ్మే రాబోయిన రమేష్, గ్రామ సర్పంచ్ జాటోత్ కవిత–అఖిల్, మాజీ సర్పంచ్‌లు జాటోత్ హటియా నాయక్, వంగాల బాబు, బండారు సత్యం, వెంకటాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన సర్పంచ్

**వేద న్యూస్, నెక్కొండ:**



నెక్కొండ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సర్పంచ్ పెండ్యాల హరి ప్రసాద్, ఉపసర్పంచ్ సింగం శ్రావణి ప్రశాంత్ సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం అమలు విధానం, భోజన నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. వంటగదుల పరిశుభ్రత, భోజన పదార్థాల నాణ్యత, నిల్వ విధానం వంటి అంశాలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి దయ్యాల సదానందం, వార్డు సభ్యులు రామారపు శిరీష రాము, మోటం మౌనిక కృష్ణంరాజు, ముద్దరబోయిన శ్రీకాంత్, మహ్మద్ అమీర్, చల్ల విష్ణు రెడ్డి, చొప్పరి జ్యోతి, భూక్యా రవి, కందీక ఉమా, కక్కెర్ల విజయ తదితరులు పాల్గొన్నారు.

# సంక్కినేని సంభారాజుకు నివాళులు

**వేద న్యూస్, నెక్కొండ:**



నెక్కొండ పట్టణ కేంద్రానికి చెందిన సంక్కినేని సంభారాజు మరణించగా ఆయన మృతదేహానికి టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఈదునూరి సాయి కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, నెక్కొండ ఉపసర్పంచ్ & యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగం శ్రావణి ప్రశాంత్, గరికపాటి కృష్ణారావు, వార్డు సభ్యులు రామారపు శిరీష రాము, మోటం మౌనిక కృష్ణంరాజు, యాట శ్రావణి వినీత్, కాంగ్రెస్ యువనేతలు దుర్గాల అశోక్, సంఘని వెంకన్న, రవి, పనికర గ్రామ సర్పంచ్ కోల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**– డీఎస్పీ పి. భిక్షపతిరావు**

**– రంగాపురంలో బాలల భద్రత, మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు**



**వేద న్యూస్, నల్లబెల్లి:**

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని డీఎస్పీ పి. భిక్షపతిరావు సూచించారు. మంగళవారం నల్లబెల్లి మండలం రంగాపురం గ్రామంలో బాలల భద్రత, మాదకద్రవ్యాల వ్యతిరేకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు, గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామ సర్పంచ్ ఓరుగంటి మాధురి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సై గోవర్ధన్, డాక్టర్ పి. ఆచార్య, రెవెన్యూ ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి (జీపీఓ) శ్యామ్, ఉపసర్పంచ్ రామ్మూర్తి, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో ఇలాంటి చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# సిరిసిల్ల-తంగళ్లపల్లి మానేరు బ్రిడ్జిపై రైతుల ధర్నా



**– కెనాల్ పనులు పూర్తిచేయాలని డిమాండ్**

**– రైతులను అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**వేద న్యూస్, తంగళ్లపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలో 11వ ప్యాకేజీ కింద ఎల్ఎం6, ఎల్ఎం4 కెనాల్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మండల రైతులు మంగళవారం ధర్నా చేపట్టారు. సిరిసిల్లతంగళ్లపల్లి మానేరు వాగు బ్రిడ్జిపై రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ ధర్నాకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మద్దతు తెలుపుతూ నాయకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం పోలీసులు ధర్నా చేస్తున్న రైతులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ తంగళ్లపల్లి 11వ ప్యాకేజీ రంగనాయక సాగర్ ద్వారా కెనాల్ నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు కేటాయించినప్పటికీ పనులు ప్రారంభించకపోవడం రైతులకు అన్యాయం అని అన్నారు. తంగళ్లపల్లి మండలంలోని సుమారు 15 గ్రామాలకు సాగునీరు అందించే ఈ కెనాల్ నిర్మాణంపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కెనాల్ నిర్మాణం పూర్తైతే సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. అయినప్పటికీ భూసేకరణ పనులు కూడా చేపట్టకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, రైతుల పక్షాన బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# కౌన్సిలర్ శ్రీనివాస్ కు సన్మానం

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో 8వ వార్డ్ కౌన్సిలర్‌గా ఘన విజయం సాధించిన మైలారం శ్రీనివాస్ను వేములవాడ రజక సంఘ పెద్దలు, రజక యువజన సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రజక సంఘ పెద్దలు మాట్లాడుతూ... శ్రీనివాస్ విజయం రజక సమాజానికి మంచి గుర్తింపు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా రజకులు ప్రతి ఎన్నికల్లో పోటీ చేసి రాజకీయ రంగంలో తమ సత్తా చాటాలని సూచించారు. ముఖ్యంగా యువత అన్ని రంగాల్లో ముందుకు వచ్చి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ పెద్దలు సీహెచ్ దేవయ్య, సీహెచ్ లాండ్రీ రమేష్ (డ్రైక్లీనింగ్), పోతారం రాజు, మర్రిపెల్లి శ్రీనివాస్, దేవయ్య, మల్లేశం, శంకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రజక యువజన సంఘ సభ్యులు శ్రీకాంత్, మహేష్, నవీన్, కమలాకర్, గంగరాజు, ప్రశాంత్, శ్రీనివాస్, వంశీకృష్ణ, ప్రణయ్, బాలు తదితర యువకులు పాల్గొని శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

# డ్రగ్స్ అనర్థాలపై అవగాహన అవసరం

**– సీఐ రంజిత్ రావు**

**వేద న్యూస్, శాయంపేట:**



డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థి దశలోనే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సీఐ రంజిత్ రావు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ఇన్స్పెక్టర్ గోపి, సీఐ రంజిత్ రావు, ఎస్ఐ జక్కుల పరమేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఇటువంటి అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు పొందవచ్చని, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలను విక్రయించినా, వినియోగించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలు, విద్యార్థులతో కలిసి "డ్రగ్స్ రహిత తెలంగాణ" కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల, గట్లకానిపర్తి ప్రభుత్వ పాఠశాల, ఎంజేపీ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, శాయంపేట మరియు పత్తిపాక గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# విద్య ద్వారానే మహిళల అభ్యున్నతి




**– కేయూ వీసీ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి**

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

సావిత్రిబాయి పులే 129వ వర్ధంతి సందర్భంగా కేయూలో ఘనంగా నివాళులు అర్పించారు. విశ్వవిద్యాలయ బీసీ సెల్ సంచాలకులు డాక్టర్ బి. సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేయూ ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దూరవిద్య ప్రాంగణంలోని పులే దంపతుల విగ్రహాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఉపకులపతి సావిత్రిబాయి పులే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ మహిళా విద్య అభివృద్ధికి సావిత్రిబాయి పులే చేసిన సేవలు అమూల్యమని, ఆమె కృషి వల్లే మహిళా విద్యకు బాటలు పడ్డాయని తెలిపారు. మహిళలు విద్యావంతులు అయితేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ అసమానతలు, వివక్షలను ఎదుర్కొన్నప్పటికీ తన లక్ష్యాన్ని వదలని మహనీయురాలు సావిత్రిబాయి పులే అని పేర్కొన్నారు. నేటి యువత ఆమె జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ బి. రమ, డాక్టర్ ఎన్. సుదర్శన్, డాక్టర్ ఆర్. మేఘన రావు, ఆచార్య కుంట ఐలయ్యతో పాటు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో సిటీ గార్డ్ కమాండో వెంకట్ రెడ్డి మృతి



**వేద న్యూస్, కాజీపేట:**

కాజీపేట పట్టణంలోని ఫాతిమా నగర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిటీ గార్డ్ కమాండో వెంకట్ రెడ్డి తీవ్రంగా గాయపడి అజర ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కాజీపేట సీఐ తెలిపారు. వెంకట్ రెడ్డి అకాల మరణం తీరని లోటని, ఆయన క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేసిన నిజాయితీ గల వ్యక్తిగా అందరి గుండెల్లో నిలిచిపోతారని సీఐ పేర్కొన్నారు. గత ఏడాదిన్నరగా క్యాన్సర్‌తో పోరాడుతున్న ఆయనకు నాలుగేళ్ల చిన్న కుమారుడు ఉండటం ఈ ఘటనను మరింత విషాదకరంగా మారుస్తోందన్నారు. వెంకట్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి ఈ క్లిష్ట సమయంలో దేవుడు ధైర్యం ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నామని కాజీపేట సీఐ తెలిపారు.

# శిథిలావస్థలు ప్రభుత్వ భవనాలు

**– ప్రాణభయంతో సేవలు చేస్తున్న సిబ్బంది**

**– మరమ్మతులు వెంటనే చేపట్టాలని వేడుకోలు**

**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పశువైద్యశాలలు నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదంలో ఉన్న ఈ భవనాల్లో సిబ్బంది ప్రాణభయంతో విధులు నిర్వహించాల్సి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణీలు, వృద్ధులకు భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయి. పాఠశాల భవనాల్లో గోడలు పాడైపోవడం, పైకప్పులు జారిపోవడం వల్ల విద్యార్థుల భద్రతపై అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి. పశువైద్యశాలల్లో కూడా పాడైన గోడలు, పైకప్పులు సేవలను ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. కొత్త భవనాల నిర్మాణం ఆలస్యమవుతున్న నేపథ్యంలో కనీసం పాత భవనాలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. భద్రతతో పాటు ప్రభుత్వ సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073